

ఉష్ణోగ్రత: గరిష్ఠం 37.6 కనిష్ఠం 19.5

రంజాన్ వేళలు
ఇఫ్తార్: 6:34 (మంగళవారం సాయంత్రం)
సహార్: 4:54 (బుధవారం ఉదయం)

ఉపాధిహామీ దిమ్మె కూలి

బాలుడి మృతి

- కులకచర్ల మండలంలో ఘటన
- తల్లికి ఆయా పోస్టు ఇప్పిస్తామని హామీ


సాయితేజ(ఫైల్)

కులకచర్ల, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు ఉపాధిహామీ దిమ్మె కూలి మీద పడటంతో నాలుగేళ్ల బాలుడు మృతి చెందాడు. ఈ సంఘటన కులకచర్ల మండలంలోని అల్లాపూర్ తండాలో జరిగింది. తండాకు చెందిన లక్ష్మణ్‌నాయక్, నవనీత దంపతులకు నలుగురు సంతానం. చిన్నవాడు సాయితేజ(4) స్థానిక అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్తున్నాడు. అంగన్‌వాడీకి పక్కనే పదేళ్ల క్రితం ఉపాధిహామీ పనులకు సంబంధించి సిమెంట్ దిమ్మెను ఏర్పాటు చేశారు. సోమవారం ఉదయం లక్ష్మణ్‌నాయక్ కుమారుడు సాయితేజను అంగన్‌వాడీ కేంద్రం దగ్గర వదిలిపెట్టాడు. ఆ సమయంలో ఆయా కమలమ్మ పిల్లలను తీసుకువచ్చేందుకు తండాలోకి వెళ్లింది. సాయితేజ ఆడుకుంటూ ఉపాధిహామీ దిమ్మె వద్దకు వెళ్లి దాన్ని పట్టుకొని ఊపగా అది మధ్యలోకి విరిగి మీదపడింది. దీంతో మెడపైన తీవ్ర గాయాలయ్యాయి. కమలమ్మ ఇతరుల సహాయంతో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో బాలుడు మృతి చెందాడు. పరిగి ఎస్సై సంతోష్‌కుమార్ సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అందుబాటులో లేకపోవడంతో ఆయన సహకారంతో ఏఎంసీ చైర్మన్ ఆంజనేయులు బాలుడి కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేలు ఆర్థిక సహాయం అందించారు. తల్లికి అంగన్‌వాడీ ఆయా పోస్టు ఇప్పిస్తామని హామీ ఇచ్చారు.



ఆకాశమే హద్దుగా!

ఉమ్మడి జిల్లాలో ప్రగతి పరుగులు

ఉమ్మడి జిల్లాలో అభివృద్ధి అన్ని రంగాల్లో ఆకాశమే హద్దుగా పరుగులు పెడుతోంది. శరవేగంగా జరుగుతున్న పారిశ్రామిక విస్తరణలో భాగంగా శివార్లలో అత్యధికంగా పరిశ్రమలు ఏర్పాటవుతున్నాయి. గడచిన ఏడాది కాలంలో రూ.6,045 కోట్ల పెట్టుబడులతో 448 పరిశ్రమలు నెలకొల్పారు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన సామాజిక ఆర్థిక సర్వే (2025)లో అనేక ఆసక్తికర విషయాలు వెల్లడయ్యాయి. తలసరి ఆదాయం, స్థూల ఉత్పత్తిలో రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలు అగ్రస్థానంలో నిలిచాయి. పెట్టుబడులు, ఎగుమతుల్లోనూ రాష్ట్రంలో అగ్రభాగంలో ఉన్నాయి.

- అన్ని రంగాల్లో దూసుకుపోతున్న అభివృద్ధి
- తలసరి, స్థూల ఆదాయంలో సరికొత్త రికార్డులు
- అంతర్జాతీయ ఎగుమతుల్లోనూ అగ్రస్థానం
- శివార్లలో శరవేగంగా పారిశ్రామిక విస్తరణ
- ఉపాధి హామీ పనుల్లోనూ మేటి

రాష్ట్ర సామాజిక, ఆర్థిక సర్వే 2025 సూచికలు

తలసరి ఆదాయం జిల్లాల వారీగా

జిల్లా	తలసరి ఆదాయం
రంగారెడ్డి	రూ. 10,55,913
మేడ్చల్	రూ. 3,43,130
వికారాబాద్	రూ. 1,98,401

స్థూల ఉత్పత్తి (రూ.కోట్లలో)

జిల్లా	స్థూల ఉత్పత్తి
రంగారెడ్డి	రూ.3,17,898
మేడ్చల్	రూ.1,04,710
వికారాబాద్	రూ.22,066

(21వ స్థానంలో వికారాబాద్)



9 నెలల్లో రూ.60వేల కోట్లు

శివార్లలో శరవేగంగా జరుగుతున్న పారిశ్రామిక విస్తరణ కారణంగా రాష్ట్రంలోనే అత్యధికంగా ఇక్కడ పరిశ్రమలు ఏర్పాటవుతున్నాయి. దీంతో ఇక్కడ నుంచి దేశ, విదేశాలకు ఎగుమతులు కూడా భారీగా పెరిగాయి. రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల నుంచే ఐటీ, ఫార్మా ఎగుమతులు కూడా అధికంగా జరుగుతున్నాయి. 2024 ఏప్రిల్ నుంచి 2024 డిసెంబర్ వరకు 9 నెలల కాలంలో రాష్ట్రంలో దాదాపు రూ.లక్ష కోట్ల విలువైన ఉత్పత్తులు ఎగుమతి జరగగా ఇందులో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నుంచే దాదాపు రూ.60వేల కోట్లు ఉండడం గమనార్హం. రంగారెడ్డి జిల్లా నుంచి 9 నెలల కాలంలో రూ. 41,535 కోట్లు, మేడ్చల్ జిల్లా నుంచి రూ.17,652 కోట్ల ఎగుమతులు



(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి): సామాజిక ఆర్థిక సర్వే నివేదిక ప్రకారం రంగారెడ్డి జిల్లా రూ.10,55,913 తలసరి ఆదాయంతో అగ్రస్థానంలో నిలిచి.. దేశంలో తొలిసారిగా తలసరి ఆదాయంలో రూ.10లక్షల మార్క్ దాటిన జిల్లాగా రికార్డుల్లోకి ఎక్కిన విషయం తెలిసిందే. మేడ్చల్ మల్కాజ్‌గిరి(రూ.3,43,130) నాల్గో స్థానంలో నిలిచింది. ఇదిలా ఉంటే పెట్టుబడులు, ఉపాధి, ఎగుమతులు, ఇతర ఆర్థికాభివృద్ధి అంశాల్లో ఉమ్మడి జిల్లా శరవేగంగా దూసుకుపోతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. కొత్త పరిశ్రమలకు అనుమతులు

మిగతా 7వ పేజీలో...

ఖనిజ ఉత్పత్తుల ఆదాయంలోనూ..

ఖనిజ ఉత్పత్తుల ద్వారా ఆదాయం అధికంగా వచ్చే జిల్లాల్లో రంగారెడ్డి జిల్లా అగ్రస్థానంలో ఉంది. ఖనిజ ఉత్పత్తుల రాబడిలో రూ.115.12 కోట్లతో మొదటి స్థానంలో రంగారెడ్డి జిల్లా నిలవగా సూర్యాపేట (రూ115.11 కోట్లు) రెండో స్థానంలో ఉంది. వికారాబాద్ 88.49 కోట్లతో 5వ స్థానంలో ఉండగా, మేడ్చల్ రూ.44.57 కోట్లతో 20వ స్థానంలో ఉంది.

మేడ్చల్‌లో బీఆర్ఎస్ సభ!

- ఔటర్ సమీపంలో స్థల పరిశీలన
- పార్టీ రజతోత్సవానికి పకడ్బందీగా ఏర్పాట్లు
- వరంగల్ జిల్లా నుంచి వేదిక మార్పు



(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి): బీఆర్ఎస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన రజతోత్సవ ఆవిర్భావ సభను వరంగల్ జిల్లా నుంచి మేడ్చల్ జిల్లాకు మార్చాలని పార్టీ నాయకత్వం నిర్ణయించినట్లు తెలిసింది. బీఆర్ఎస్ (టీఆర్ఎస్) ఆవిర్భవించి 25ఏళ్లు అవుతున్న సందర్భంగా ఏప్రిల్ 27వ తేదీన వరంగల్‌లో రజతోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని ఆ పార్టీ నాయకత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఇందుకు సంబంధించి ఇప్పటి నుంచే జిల్లాల వారీగా సన్నాహక సమావేశాలు నిర్వహిస్తున్నారు. మళ్లీ పార్టీ పూర్వవైభవం తీసుకువచ్చేందుకు భారీగా జనసమీకరణ చేస్తోంది.

నగరంపై పట్టు బిగించేలా..

అయితే ఎండ తీవ్రత అధికంగా ఉండే అవకాశాలు ఉండడంతో ఈ సభను అందరికీ అందుబాటులో ఉండే విధంగా మేడ్చల్ జిల్లా పరిధిలో నిర్వహించే విషయాన్ని పార్టీ నాయకత్వం పరిశీలిస్తోంది. ఇందులో భాగంగా దుండిగల్ నుంచి ఘట్‌కేసర్ మధ్య ఔటర్ రింగురింగురోడ్డుకు సమీపంలో బహిరంగ సభ కోసం స్థలాన్ని పరిశీలించాలని సోమవారం జిల్లా పార్టీ నాయకత్వానికి అధినేత నుంచి ఆదేశాలు అందాయి. ట్రాఫిక్ ఇతర సమస్యలు లేకుండా ఔటర్‌కు ఆనుకునే ఉండే విధంగా ఈ సభను నిర్వహించేలా నిర్ణయించినట్లు సమాచారం. శివార్లలో భారీ బహిరంగ సభ నిర్వహించడం వల్ల నగరంపై మళ్లీ పట్టుకొనసాగించాలని బీఆర్ఎస్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. అలాగే ఈ సభకు జాతీయ, అంతర్జాతీయ మీడియాను కూడా ఆహ్వానిస్తుండడంతో హైదరాబాద్‌లో అంతర్భాగంగా ఉన్న ఈ ప్రాంతంలో సభను నిర్వహించడం మేలని బీఆర్ఎస్ నాయకత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది.

ఈదురుగాలులతో వాన

- కూలిన చెట్లు, సూచికబోర్డులు
- భారీగా నిలిచిన ట్రాఫిక్
- అకాల వర్షంతో పంటలు ఆగమాగం

6





పంట పొలాల్లో హైటెన్షన్

మర్పల్లి, మోమిన్‌పేట్ నవాబుపేట, వికారాబాద్ మండలాల పరిధిలో టవర్లు

- రైతులకు ఇచ్చే పరిహారంపై స్పష్టత కరువు
- సరైన లెక్కలు చెప్పకుండా రైతులతో బేరసారాలు

విద్యుత్ లైన్ ఏర్పాటుకు సర్వే పూర్తి

వికారాబాద్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): పచ్చని పంట పొలాల్లో హైటెన్షన్ విద్యుత్ లైన్ ఏర్పాటు చేయనున్నారు. 'పవర్ గ్రిడ్ బీదర్ ట్రాన్స్‌మిషన్ లిమిటెడ్' సంస్థ బీదర్ నుంచి వికారాబాద్ నియోజకవర్గంలోని నాలుగు మండలాల మీదుగా మహేశ్వరం వరకు విద్యుత్ లైన్ ఏర్పాటు చేస్తోంది. హై ఓల్టేజ్ కలిగిన ఈ లైన్లను రైతుల పొలాల మీదుగా ఏర్పాటు చేస్తున్నారు. ఆ విద్యుత్ సంస్థ సంబంధిత రైతులకు నష్ట పరిహారం అందిస్తామని చెప్పి సర్వే పూర్తి చేసుకుని పనులు చేసేందుకు సిద్ధమైంది. ఆయా గ్రామాల్లో రైతుల పొలాల్లో టవర్ల ఏర్పాటుకు పనులు సైతం ప్రారంభించారు. ఈ క్రమంలో రైతులకు కొంత డబ్బు అందించి మిగితా డబ్బును కాజేయాలని కొందరూ కుట్ర చేస్తున్నారు. దీంతో రైతుల వద్దకు వెళ్లి బేరాలు మొదలు పెడుతున్నారు. ఒకరికి రూ.5 లక్షలు, ఒకరికి రూ.10 లక్షలు ఇప్పిస్తామని ఆశజూపి లెక్కలు ఎవరికీ చెప్పొద్దని నమ్మబలుకుతున్నారు.

నాలుగు మండలాలు..

వికారాబాద్ నియోజకవర్గంలో నాలుగు మండలల నుంచి ఈ హైటెన్షన్ విద్యుత్ లైన్లు వెళ్తోంది. మర్పల్లి,

మిగతా 8వ పేజీలో...


కాస్లాబాద్ గ్రామంలో విద్యుత్ టవర్ కోసం తీసిన గుంత

గళం విప్పిన ఎమ్మెల్యే



మున్సిపాలిటీలను జీహెచ్ఎంసీలో

కలపొద్దు

- మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి

మేడ్చల్ ప్రతినిధి, మార్చి 24(ఆంధ్రజ్యోతి): మేడ్చల్ నియోజకవర్గంలోని మున్సిపాలిటీలను జీహెచ్ఎంసీలో కలపొద్దని మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి మంత్రి శ్రీధర్‌బాబును వేడుకున్నారు. సోమవారం ఆయన అసెంబ్లీలో మాట్లాడుతూ నియోజకవర్గంలోని 61 గ్రామాలను మున్సిపాలిటీలుగా మార్చారని, ప్రస్తుతం నియోజకవర్గంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు లేరన్నారు. అందుకు తాను ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు. కానీ గ్రామాలను మున్సిపాలిటీలుగా మార్చి వెంటనే వాటిని జీహెచ్ఎంసీలో కలుపుతారని మేడ్చల్ ప్రజలు భయాందోళనలకు గురౌతున్నారన్నారు. ప్రజల తరపున తాను అడుగుతున్నానని జీహెచ్ఎంసీలో కలుపమని సభలో హామీ ఇవ్వాలని స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను మల్లారెడ్డి వేడుకున్నారు.

ప్రజావాణికి 116 దరఖాస్తులు

- వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్

వికారాబాద్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో 116 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, ఆర్డీవో వాసుచంద్ర, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.


ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి

- మేడ్చల్ కలెక్టర్ గౌతమ్


మేడ్చల్ కలెక్టరేట్‌లో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ గౌతమ్

మేడ్చల్ ప్రతినిధి, మార్చి 24(ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలోనే కాకుండా ప్రజల నుంచి ఫిర్యాదులు ఎప్పుడు వచ్చినా అధికారులు బాధ్యతాయుతంగా స్పందించి పరిష్కరించాలని కలెక్టర్ గౌతమ్ సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి సత్వరమే పరిష్కరించాలన్నారు. వినతులపై చేపట్టిన చర్యలను ఆన్‌లైన్ పోర్టల్‌లో ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలని సూచించారు. ప్రజావాణిలో ఆయనతో పాటు అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, డీఆర్‌ఓ హరిప్రియ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.


సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నేతలు

బలహీనవర్గాల ఆత్మబంధువు సీఎం రేవంత్‌రెడ్డి

శామీర్‌పేట, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీనవర్గాల ఆత్మబంధువు సీఎం రేవంత్‌రెడ్డి అని మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి వజ్రేశ్‌యాదవ్ అన్నారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను పెంచుతూ బిల్లులను ఆమోదించిన సందర్భంగా సోమవారం తూంకుంట మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, శామీర్‌పేట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వైఎస్‌గౌడ్ ఆధ్వర్యంలో తూంకుంటలోని అంబేద్కర్ విగ్రహం నుంచి రాజీవ్‌రహదారిలోని దొంగల మైసమ్మ చౌరస్తా వరకు పెద్ద ఎత్తున విజయోత్సవ ర్యాలీని నిర్వహించారు. వజ్రేశ్‌యాదవ్ మాట్లాడుతూ హామీలను అంచెలంచెలుగా అమలు చేస్తున్నారన్నారు. దొంగల మైసమ్మ చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా ఆర్టీఏ సభ్యుడు జైపాల్‌రెడ్డి, నర్సింలుయాదవ్, సాయిపేట శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలి

- అదనపు కలెక్టర్ సుధీర్ ● 16 మందికి కారుణ్య నియామక పత్రాలు అందజేత

7

యథేచ్ఛగా ఇసుక దందా

- అనుమతులకు మించి తవ్వకాలు
- మామూళ్ల మత్తులో అధికారులు
- దోమ మండలంలో ఇష్టారాజ్యం

8

అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలి


ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ను సన్మానిస్తున్న నాయకులు

శంషాబాద్ రూరల్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): శంషాబాద్ మున్సిపాలిటీ లోని 10,11 వార్డుల్లో అభివృద్ధి పనులకు మరిన్ని నిధులు కేటాయించాలని స్థానికులు కోరారు. సోమవారం ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్‌ను దూడల వెంకటేశ్ గౌడ్, పారేపల్లి శ్రీనివాస్‌గౌడ్, పెదిరిపాటి ప్రవీణ్‌గౌడ్, దొడ్డి పెంటయ్య, కొండ దర్శన్, రాచమల్ల విశ్వనాథం, సుధాకర్, నాగరాజు తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు. వార్డుల్లో అభివృద్ధి పనులకు నిధులు కేటాయించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారన్నారు.

ఈదురుగాలులతో వాన

● కూలిన చెట్లు, సూచికబోర్డులు ● పంటలు ఆగమాగం

కొడంగల్/బొంరాస్‌పేట్/ దుద్యాల/కోట్‌పల్లి/మోమిన్‌పేట్ మార్చి 24 (ఆంధ్రజ్యోతి): నాలుగో రోజూ సోమవారం వికారాబాద్ జిల్లాలో అక్కడక్క భారీ ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. కొడంగల్ పట్టణ శివారులోని హైదరాబాద్-బీజాపూర్ మార్గంలో ఉన్న సూచిక బోర్డు ఒక్కసారిగా కిందపడిపోయింది. ఆసమయంలో రోడ్డుపై వాహనాల రాకపోకలు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. దీంతో రెండు కిలో మీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. ఎస్సై జీవీ.సత్యనారాయణ పోలీసు సిబ్బందితో అక్కడికి చేరుకొని క్రేన్, జేసీబీ సహాయంతో సూచిక బోర్డును రోడ్డుపై నుంచి పక్కకు తొలగించారు. కొడంగల్ బస్టాండ్‌లో ప్రయాణికుల కోసం ఏర్పాటు చేసిన షెడ్డు కూలిపోయింది. కొడంగల్‌లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడటంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈదురుగాలులు, వడగండ్ల వర్షానికి పలు గ్రామాల్లో చెట్లు నేల కొరిగాయి. బొంరాస్‌పేట్ మండలంలో వడగండ్ల వర్షం కురిసింది. వడిచర్ల గ్రామంలో గోపాల్‌రెడ్డికి చెందిన రేకుల షెడ్డు ఈదురుగాలులకు లేచిపోయింది. ఎన్కెపల్లి, కొత్తూర్, మహంతీపూర్, రేగడిమైలారం గ్రామాల్లో మోస్తరు వర్షం కురిసింది. అకాల వర్షంతో వరి పంటలకు నష్టం వాటిల్లింది. దుద్యాల మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో కురిసిన అకాల వర్షానికి పంటలు దెబ్బతిన్నాయి. చిలుముల్‌మైలారంలో వచ్చిన వడగళ్ల వానకు చేతికొచ్చిన పంటలు నేలకొరిగాయి. ఓ చోట చెట్టు విరిగి విద్యుత్ తీగలపై పడింది. వరి, మామిడి తోటలు బాగా దెబ్బతిన్నాయి. కోట్‌పల్లి మండల కేంద్రంలో కురిసిన వానకు కూరగాయల సంత ఆగమాగమైంది.

రైతులను ఆదుకుంటాం: మర్పల్లి ఏఎంసీ చైర్మన్ మహేందర్‌రెడ్డి

మోమిన్‌పేట్ మండలంలో ఇటీవల కురిసిన వడగండ్ల వర్షానికి పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని ఎన్కతల, మేకవనంపల్లి, రామ్‌నాథ్‌గూడుపల్లి తదితర గ్రామాల్లో వర్షానికి దెబ్బతిన్న పంటలను ఆయన పరిశీలించారు.


కొడంగల్: హైదరాబాద్-బీజాపూర్ రోడ్డుపై కూలిన సూచిక బోర్డు


దుద్యాల్ : ఎంపీడీవో కార్యాలయం ఎదుట విరిగిన చెట్టు


కోట్‌పల్లి : వర్షానికి రోడ్డుపాలైన కూరగాయలు


ఉల్లిపంటను పరిశీలిస్తున్న మహేందర్‌రెడ్డి


వడిచర్లలో వడగండ్ల వర్షం

గుడిసెలు వేసుకున్న పేదలకు ఇళ్ల పట్టాలివ్వాలి

- ఎమ్మెల్యే యాదయ్యను కోరిన సీపీఐ నాయకులు

చేవెళ్ల, మార్చి 24(ఆంధ్రజ్యోతి) : చేవెళ్ల పట్టణ కేంద్రంలోని సర్వే నెంబర్ 75 ఉన్న ప్రభుత్వ భూమిలో పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రామస్వామి, ప్రభులింగం తెలిపారు. సోమవారం చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య నివాసంలో ఆ పార్టీ నాయకులు కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు సంవత్సరాలుగా చేవెళ్ల పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ భూమి సర్వే నెంబర్ 75లో పేదలు గుడిసెలు వేసుకుని అందులోనే జీవనం సాగిస్తున్నారని చెప్పారు. ఆ పేదలకు ఇళ్ల పట్టాలు తక్షణమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి సత్తిరెడ్డి, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వడ్లసత్యనారాయణచారి, అంజయ్య, కృష్ణగౌడ్, మంజుల ఉన్నారు.

క్షయ రహిత జిల్లాగా మారుస్తాం

తాండూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది నాటికి క్షయ రహిత జిల్లాగా మారుస్తామని వికారాబాద్ డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌వో రవీందర్ యాదవ్ వెల్లడించారు. తాండూరులో ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం ఏర్పాటు చేసిన ర్యాలీ, ప్రతిజ్ఞ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. పరిశ్రమల్లో కార్మికులకు క్షయ వ్యాధిపై అవగాహన కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. క్షయ వ్యాధి రాకుండా 18-60ఏళ్ల వారికి ఏప్రిల్ మొదటి వారంలో వ్యాక్సిన్ పంపిణీ చేపడుతామని ఆయన వివరించారు. ఈ ఏడాది ఇప్పటి వరకు 340 మంది రోగులను గుర్తించి మందులు అందజేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సమీఉల్లా, డాక్టర్ గిరిధర్, అంబికా, రవికుమార్, హర్షవర్దన్‌రెడ్డి, ల్యాబ్ టెక్నీషియన్ పాల్గొన్నారు.


పారా క్రీడల్లో సత్తాచాటిన నేత్ర విద్యాలయం విద్యార్థులు

పారా క్రీడల్లో విద్యార్థుల ప్రతిభ

శంషాబాద్ రూరల్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ వేదికగా జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఈనెల 21 నుంచి 23 వరకు జరిగిన 2వ ఖేలో ఇండియా-2025 పారాక్రీడల్లో శంషాబాద్ మండలంలో శ్రీ చిన్నజీయర్‌స్వామి ఆధ్వర్యంలో కొనసాగుతున్న నేత్ర విద్యాలయం విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. ఇండియా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు 10పతకాలు సాధించాయి. అందులో 7పతకాలను నేత్ర విద్యాలయం విద్యార్థులు సాధించడం విశేషం. పాఠశాలకు చెందిన లలిత 200 మీటర్లు, రవని 100 మీటర్లు, లలిత 400 మీటర్లు, రవని 200 మీటర్లు, శిరీష 100 మీటర్ల పరుగు పందెంలో సత్తా చాటి బంగారు పతకాలు సాధించారు. అదే విధంగా విద్యార్థి అంబటి స్వరాజ్ లాంగ్‌జంప్‌లో రజత పతకాన్ని సాధించాడు. పాఠశాల యజమాన్యం విద్యార్థులను అభినందించింది.



నేల వాలిన మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న ఏడీఏ

పంట నష్టపోయిన రైతులకు పరిహారమందేలా చూస్తాం

మాడ్గుల, మార్చి 24(ఆంధ్రజ్యోతి): ఈదురు గాలులు, వర్షంతో శనివారం పెద్ద మాడ్గుల, ఇర్విన్, ఆర్కపల్లి, అన్నెబోయినపల్లి, బ్రాహ్మణపల్లి తదితర గ్రామాలు, తండాల్లో మొక్కజొన్న పంటకు నష్టం వాటిల్లింది. సోమవారం ఆయా గ్రామాల్లో ఆమనగల్-1 వ్యవసాయ సంచాలకులు శోభారాణి, ఏవో అరుణకుమారి పంటలను పరిశీలించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో 357ఎకరాల మేరకు మొక్కజొన్న పంట నేల వాలిందని, నష్టపోయిన రైతులకు ప్రభుత్వం సాయం అందేలా కృషి చేస్తామని అధికారులు తెలిపారు. వ్యక్తిగతంగా ప్రతీ రైతు నష్టపోయిన పంటల వివరాలను ప్రభుత్వానికి నివేదిస్తామని ఏడీఏ, ఏవో తెలిపారు.

'కాంగ్రెస్ నాయకుడి హత్య తీరని లోటు'

మహేశ్వరం, మార్చి 24(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, న్యాయవాది ఇస్రాయెల్‌ను హత్యచేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని మహేశ్వరం కాంగ్రెస్ ఇన్‌చార్జి కేఎల్లార్ అన్నారు. సోమవారం మహేశ్వరంలో ఇస్రాయెల్ చిత్రపటానికి నివాళి అర్పించారు. ఆయన మాట్లాడుతూ.. ఇస్రాయెల్‌ను హత్య చేసిన వారిని, వారికి సహకరించిన వారిని ప్రభుత్వం శిక్షించాలని పోలీసులకు విజ్ఞప్తి చేశారు. సీనియర్ నాయకుడు హత్యకు గురికావడం తీరని లోటన్నారు. ఇస్రాయెల్ కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని, వారికి మనోధైర్యాన్ని కల్పించేందుకు నాయకులు, కార్యకర్తలు అందుబాటులో ఉండాలని లక్ష్మారెడ్డి సూచించారు. ఇస్రాయెల్ అంత్యక్రియలు మంగళవారం స్వగ్రామం తుమ్మలూరులో జరుగుతాయని, కాంగ్రెస్ శ్రేణులు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కేఎల్లార్ కోరారు.



రాజ్‌భూపాల్‌గౌడ్‌ను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

బీజేపీ జిల్లా అధ్యక్షుడికి సన్మానం

కేశంపేట, మార్చి 24(ఆంధ్రజ్యోతి): బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన రాజ్‌భూపాల్‌గౌడ్‌ను మండల బీజేపీ నాయకులు ఘనంగా సన్మానించారు. సోమవారం శంషాబాద్‌లోని ఆయన కార్యాలయంలో కలిసిన జిల్లా ఓబీసీ ఉపాధ్యక్షుడు పసుల నరసింహయాదవ్, జిల్లా సాంస్కృతిక శాఖ కో-కన్వీనర్ నరేందర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, సురేష్, కుమార్‌గుప్తాలు శాలువాతో సత్కరించారు. పార్టీ బలోపేతానికి కృషిచేయాలని ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు వారికి సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు వచ్చినా బీజేపీ సత్తాచాటాలన్నారు.



దీక్షలో పాల్గొన్న జేఏసీ నాయకులు

మండల సాధన పోరాటం ఉధృతం

తలకొండపల్లి, మార్చి24(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం సాధనకు గట్టిప్పలపల్లి వాసులు పోరాటాన్ని ఉధృతం చేశారు. గ్రామస్థులు, సమీప 10 పంచాయతీల ప్రజలు ఏకమయ్యారు. గట్టిప్పలపల్లిని మండలం చేయాలని జేఏసీ చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారానికి 139వ రోజుకు చేరాయి. జేఏసీ, వివిధ పార్టీల నాయకులు, యువకులు పాల్గొన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న కొత్త మండలాల్లో గట్టిప్పలపల్లినీ చేర్చాలని డిమాండ్ చేశారు.

సాగులో ఉన్న రైతులకు పట్టాలు ఇవ్వాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శి మహిపాల్

మోమిన్‌పేట్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేసారం గ్రామ శివారులోని ఫారెస్టు భూముల్లో ఎన్నో ఏళ్లుగా పంటలను సాగు చేస్తున్న పేద రైతులకు ప్రభుత్వం పట్టాలు అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మహిపాల్ డిమాండ్ చేశారు. సీపీఎం నాయకులతో కలిసి సోమవారం మోమిన్‌పేట్ మండల కేంద్రంలో తహసీల్దార్ మనోహరచక్రవర్తికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న రైతుల భూ సమస్యను వెంటనే ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. రైతులు పంట పొలాలకు వెళ్లకుండా దారి మూసి వేయడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంచర్ వ్యక్తులపై చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా పెండింగ్‌లో ఉన్న ఉపాధి డబ్బులను కూలీలకు అందించాలన్నారు. పల్లె దవాఖానాకు మరమ్మతులు చేయించి వైద్యుడి నియామకం, కమ్యూనిటీ లైబ్రరీ ఏర్పాటు చేయాలన్నారు. ఇందుకు స్పందించి తహసీల్దార్ సంబంధిత అధికారులతో మాట్లాడతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో యువజన సంఘం నాయకులు ఆనందం, స్టాలిన్, మహేందర్, రమేశ్, శ్రీకాంత్, అరుణ్‌కుమార్, కృష్ణ, భాగ్యరాజ్ తదితరులు పాల్గొన్నారు.

రాయల్టీ చెల్లించని నాపరాతి లారీలపై కేసులు

» మైన్స్ ఏడీ సత్యనారాయణ

తాండూరురూరల్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): రాయల్టీ పత్రాలు ఉంటేనే నాపరాతి లారీలను రాష్ట్రంలోకి అనుమతిస్తామని లేదంటే కేసులు నమోదు చేస్తామని మైన్స్ ఏడీ సత్యనారాయణ అన్నారు. మండలంలోని జినుగుర్తి గ్రామ శివారులో నాపరాతి గనుల నుంచి నాపరాతిని తీసుకువస్తున్న లోడ్ లారీలపై అధికారులు తనిఖీలు నిర్వహించారు. మైన్స్ ఏజీ (అసిస్టెంట్ జియాలజిస్ట్) నాగరాజు, మైన్స్ ఆర్‌ఐ నిర్మల సిబ్బందితో కలిసి సోమవారం సాయంత్రం 6.30 గంటల ప్రాంతంలో జినుగుర్తి నుంచి వస్తున్న నాపరాతి లారీలను తనిఖీ చేశారు. అయితే అట్టి లారీలు కర్ణాటకలోని మిర్యాణ్ నాపరాతి గనుల నుంచి నాపరాతి లోడ్‌తో వస్తున్నట్లు అధికారులు ధ్రువీకరించారు. వాటిని తనిఖీలు నిర్వహించగా 16 లారీలకు రాయల్టీలకు సంబంధించిన కాగితాలు ఉండటంతో వదిలేశారు. మరో 8లారీలకు రాయల్టీ పత్రాలు లేకపోవడంతో వాటిని కరన్‌కోట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే మైన్స్ అధికారులు తనిఖీ చేస్తున్న సమయంలో కరన్‌కోట్ పోలీసు స్టేషన్ నుంచి ఏఎస్‌ఐతో పాటు కొంతమంది పోలీసుల సమక్షంలోనే తనిఖీ చేసినట్లు తాండూరు మైన్స్ ఏడీ తెలిపారు. రాయల్టీలు లేని ఎనిమిది లారీలను కరన్‌కోట్ పోలీసులకు అప్పగించినట్లు మైన్స్ అధికారులు తెలిపారు. వీటిపై మంగళవారం(నేడు) పూర్తిస్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు. వారి వెంట మైన్స్ సిబ్బంది మధు, ప్రవీణ్, శ్రీనివాస్ తదితరులున్నారు.

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే యాదయ్య

చేవెళ్ల, మార్చి 24(ఆంధ్రజ్యోతి): ఇఫ్తార్ విందు మత సామరస్యానికి ప్రతీక అని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. సోమవారం మాజీ జెడ్పీటీసీ ఎం.మాలతికృష్ణారెడ్డి ముస్లింలకు చేవెళ్లలోని పద్మావతి కన్వెన్షన్‌లో ఇఫ్తార్ ఏర్పాటు చేశారు. ఈ విందుకు ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా వచ్చారు. రంజాన్ సందర్భంగా ముస్లింలకు ఇఫార్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ బి.కృష్ణయ్య, కాంగ్రెస్ సీనియర్ నాయకులు బల్వంత రెడ్డి, వసంతం, ఎం.యాదగిరి, బాసిత్, మోసిన్, జాఫర్, శ్రీనివాస్, ఆసిఫ్, సలీం, తాజుద్దీన్, నషీర్, చోటు, ఇబ్రహీం, అక్బర్, కృష్ణ, దయాకర్, సాయికుమార్‌రెడ్డి, వినయ్‌కుమార్‌రెడ్డి, శేరి శివారెడ్డి, మోహన్‌రెడ్డి ఉన్నారు.

గిట్టుబాటు లేక.. రోడ్డుపై టమాట

గిట్టుబాటు ధర లేకపోవడంతో టమాట రైతులు లబోదిబోమంటున్నారు. మార్కెట్‌లో టమాట ధర దారుణంగా పడిపోవడంతో మంచాల మండల పరిధి అస్మత్‌పూర్‌లో రోడ్డుపైనే టమాటాలను పారబోశారు. టమాట కిలో ధర రూ.3 పలికితే మార్కెట్‌కు తరలించడానికి అయ్యే రవాణా ఖర్చులు రాని పరిస్థితి నెలకొందని రైతులు వాపోతున్నారు. ధరల నియంత్రణపై ప్రభుత్వం దృష్టిసారించాలని కోరారు.

మంచాల, మార్చి 24(ఆంధ్రజ్యోతి)



చేపల మార్కెట్లు ఎక్కడ?

» చెరువులు, ఇంటి పరిసరాల్లో అమ్మకాలు

» మార్కెట్లకు నోచుకోని మత్స్యకారులు

మొయినాబాద్ రూరల్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల ఉపాధి కోసం గత ప్రభుత్వం చెరువు, కుంటల్లో చేపపిల్లలు పెంచి అమ్ముకునే కార్యక్రమాన్ని నిర్వహించింది. మొయినాబాద్ మండల గ్రామాల్లో 50కిపైగానే కుంటలు, చెరువులున్నాయి. చేపల పెంపకానికి అనుకూలమైనవి 15 ఉన్నాయి. ఈ చెరువుల్లో లక్షలాది చేపపిల్లలను వదిలారు. ప్రస్తుతం అవి పెద్దవై అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయి. చిలుకూరు, వెంకటాపూర్, అజీజ్‌నగర్, నాగిరెడ్డిగూడ గ్రామాల్లో మత్స్యకార సంఘాలున్నాయి. వీటిల్లో ఒక్కదాంట్లో 130 మంది చొప్పున సభ్యులు ఉన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ముదిరాజు, వడ్డెరలు ఉన్నారు. వీరి వృత్తి చేపల వేట. అయితే ఫిష్ కార్పొరేషన్‌లో అన్ని గ్రామాల మత్స్యకారులకు సభ్యత్వాల్లేవు. తమ సొసైటీలను రిజిస్టర్ చేసేందుకు అధికారులు చొరవచూపడం లేదని మత్స్యకారులు ఆరోపిస్తున్నారు. సొసైటీలో సభ్యత్వం ఉంటే ప్రభుత్వ పథకాలు అందుతాయని అంటున్నారు. మండలంలో 28 పంచాయతీల్లో చిలుకూరు, వెంకటాపూర్, అజీజ్‌నగర్ సొసైటీలో మాత్రమే రిజిస్టర్ అయ్యాయి. అమ్డాపూర్, నక్కలపల్లి, ఎన్కేపల్లి గ్రామాల మత్స్యకారులు నైపుణ్య శిక్షణ పొందుతున్నారు.



చిలుకూరులో రోడ్డు పక్కన చేపల విక్రయాలు

మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తేనే..

చేపల దిగుబడి బాగానే ఉంటున్నా మార్కెటింగ్ సౌకర్యం లేక మత్స్యకారులు చెరువుల వద్దనే చేపలు అమ్ముకుంటున్నారు. నియోజకవర్గ కేంద్రాల్లోనూ చేపల మార్కెట్లు లేవు. రోడ్ల పక్కన విక్రయిస్తున్నారు. మార్కెటింగ్ సౌకర్యం కోసం ఫిష్ కార్పొరేషన్‌ను ప్రతిపాదనలు పంపినా ఆమోదం పొందడం లేదు. సొంత స్థలాలు చూసుకుంటే భవన నిర్మాణానికి నిధులు ఇస్తామని అధికారులు చెబుతున్నారని మత్స్యకారులు పేర్కొంటున్నారు. మొయినాబాద్, అజీజ్‌నగర్, చిలుకూరు, హిమాయత్‌నగర్ గ్రామాల్లో ఫిష్ మార్కెట్లు ఏర్పాటు చేస్తే సౌకర్యంగా ఉంటుంది. చిలుకూరులో చేపల అమ్మకానికి చిన్న గది ఉన్నా అది సరిపోవడంలేదని, 130మంది సభ్యులున్న గ్రామంలో చేపల అమ్మకానికి ఎకరం స్థలం కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

అమ్ముకునేందుకు స్థలాలు చూపాలి



ప్రభుత్వం మత్స్యకారుల అభివృద్ధికి తోడ్పాటు ఇస్తోంది. చెరువులు, కుంటల్లో చేపపిల్లలను వదుల్తున్నారు. అయితే చేపల అమ్మకానికి మాకు మార్కెట్ లేదు. విధిలేక ఎక్కడపడితే అక్కడే విక్రయిస్తున్నాం. కొందరం ఇళ్ల ముందే చేపలు అమ్ముకుంటున్నాం. చేపల మార్కెట్ ఉంటే ఎక్కడెక్కడి నుంచో కొనుగోలుదారులు వస్తారు. దీంతో మాకు లాభం వస్తుంది. మండలంలో చేపల విక్రయానికి అన్ని గ్రామాల వారికి కలిపి 5ఎకరాలను కేటాయిస్తే చేపల మార్కెట్ నిర్మించుకుంటాం.

- శ్రీరాములు, జిల్లా మత్స్యకార సంఘం కన్వీనర్

ప్రభుత్వం సౌకర్యాలను కల్పించాలి



చేప పిల్లలు పెద్దగయ్యాక విక్రయించేందుకు స్థలాలు లేవు. ప్రభుత్వం మత్స్యకారులపై దృష్టిసారించాలి. ప్రభుత్వం చేపల విక్రయానికి మార్కెట్ ఏర్పాటు చేస్తే అమ్మకాలు ఎక్కువంగా ఉంటాయి. సొసైటీలు, మర్కెట్లు లేక ఇబ్బందులు తప్పడం లేదు. మాకు చేపల విక్రయానికి మండల కేంద్రం, గ్రామాల్లో అనువైన విక్రయస్థలాలను గుర్తించాలి.

- బుర్రకాయల మల్లేశ్, మత్స్యకార సొసైటీ అధ్యక్షుడు

చెట్లు నరికితే చట్టపరమైన చర్యలు

యాలాల, మార్చి 24, (ఆంధ్రజ్యోతి): అటవీ ప్రాంతంలో చెట్లను నరికితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ధారూర్ అటవీ రేంజ్ అధికారి రాజేందర్ సోమవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. మండలంలోని రాస్నం, గంగసాగర్, సంగాసంగాయిపల్లితండా, పగిడ్యాల్, జుంటుపల్లి, బాకాపూర్, అన్నసాగర్ గ్రామాలకు చెందిన కొందరు రాత్రివేళల్లో అటవీ ప్రాంతంలోకి వెళ్లి ట్రాక్టర్లు, జేసీబీలతో వెళ్లి అక్రమంగా చెట్లను నరికివేస్తున్నారని తెలిపారు. చెట్ల నరికివేత అనంతరం అడవి భూమిలో సాగు చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని అన్నారు. ముఖ్యంగా సంగాయిపల్లిమీదితండా, నడిమితండా, వెనుకతండా, బాణాపూర్ తండా, రాస్నం, గంగసాగర్ గ్రామాలకు చెందిన వారు అలైగ్‌మెంట్ పట్టాలు అని ఆర్వోఎఫ్ఆర్ భూముల సాగుతో అడవి భూమిని ఆక్రమించుకుంటున్నాని తెలిపారు. అటవీ ప్రాంతంలో అక్రమసాగు చేసినా, నిప్పు పెట్టినా ఉపగ్రహ ఛాయా చిత్రాల ద్వారా సమాచారం వస్తుందని, సంబంధితవ్యక్తుల వివరాలు తెలుసుకుంటామన్నారు. ఆర్వోఎఫ్ఆర్ భూములను రద్దు చేసేందుకు ఉన్నతాధికారులకు సిఫార్సు చేస్తూ చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అడవి సంరక్షణకు అందరూ సహకరించాలని ఆయన కోరారు.

ఆకాశమే హద్దుగా!

(ఐదో పేజీ తరువాయి)

జారీ చేసేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న తెలంగాణ స్టేట్ ఇండస్ట్రియల్ ప్రాజెక్ట్ అప్రూవల్ అండ్ సెల్ఫ్ సర్టిఫికేషన్ సిస్టమ్ (టీజీ ఐపాస్) విధానంతో రంగారెడ్డి, మేడ్చల్, వికారాబాద్ జిల్లాల్లో భారీగా పెట్టుబడులు వస్తున్నాయి. దేశంలోనే ఆదర్శంగా నిలిచిన టీజీ-ఐపాస్‌తో ఆన్‌లైన్ దరఖాస్తుతో అన్నిరకాల అనుమతులు సింగిల్ విండో విధానంలో నెలరోజుల వ్యవధిలోనే ఇస్తున్న విషయం తెలిసిందే. అలాగే కొత్తగా ఏర్పాటు చేసే కంపెనీలకు ప్రోత్సాహకాలు ఇస్తున్నారు. పారదర్శకంగా అనుమతులు జారీ చేస్తుండడంతో వివిధ ప్రాంతాలకు చెందిన ప్రముఖ పారిశ్రామిక, వ్యాపార, వాణిజ్యవేత్తలు శివార్లలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తిచూపుతున్నారు. ఉమ్మడి జిల్లాలో మౌలిక సదుపాయాలు దండిగా ఉండడంతో నూతనంగా ఏర్పాటు చేస్తున్న పారిశ్రామికవాడల్లో పరిశ్రమలు పెట్టేందుకు ప్రముఖ కంపెనీలు ఆసక్తి చూపుతున్నాయి. టీజీఐపాస్ అమల్లోకి తెచ్చిన తరువాత ఈ మూడు జిల్లాల్లో రూ.40వేల కోట్ల పెట్టుబడులతో 7532 కంపెనీలు ఏర్పాటయ్యాయి. తద్వారా దాదాపు 3లక్షల మందికిపైగా ఉపాధి అవకాశాలు వచ్చాయి. గడిచిన ఏడాది కాలంలో రూ.6045 కోట్ల పెట్టుబడులతో 448 పరిశ్రమలు నెలకొల్పారు. ఏడాది కాలంలో 16వేల మందికిపైగా ఉపాధి అవకాశాలు కల్పించారు.

20 లక్షల పని దినాలు కల్పించి..

ఉపాధి హామీ పనుల్లో రంగారెడ్డి జిల్లా అగ్రస్థానంలో నిలిచింది. గడిచిన ఆర్థిక సంవత్సరంలో కూలీలకు 20 లక్షల పనిదినాలు కల్పించి 93.5శాతం లక్ష్యాలను సాధించింది. 92శాతం లక్ష్యాలు సాధించి మేడ్చల్ మూడో స్థానంలో నిలవగా 89.3శాతం లక్ష్యాలు సాధించి వికారాబాద్ 19వ స్థానంలో ఉంది.

2024 ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకు సరుకుల ఎగుమతులు

జిల్లా	ఎగుమతులు (రూ.కోట్లలో)	రాష్ట్రంలో శాతం
రంగారెడ్డి	41,535	41.43
మేడ్చల్	17,652	17.60

2024-2025 ఆర్థిక సంవత్సరంలో వంట గ్యాస్ కనెక్షన్లు ... ఆయిల్ కంపెనీల వారీగా (లక్షల్లో)

జిల్లా	ఐఓసీఎల్	హెచ్‌పీసీఎల్	బీపీసీఎల్	మొత్తం
రంగారెడ్డి	7.22	5.30	2.41	14.93
మేడ్చల్	5.63	5.30	2.80	13.71
వికారాబాద్	1.26	0.94	0.45	2.65

10 ఏళ్లలో కంపెనీల స్థాపన, పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు

జిల్లా	కొత్త కంపెనీలు	పెట్టుబడులు (రూ.కోట్లలో)	ఉపాధి కల్పన
రంగారెడ్డి	1,783	25,602	1,07,002
మేడ్చల్	5,062	13,199	1,24,176
వికారాబాద్	667	1,024	7,266

2024-25లో కంపెనీల స్థాపన, పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు

జిల్లా	కొత్తగా ఏర్పాటైన కంపెనీలు	పెట్టుబడులు (రూ.కోట్లలో)	ఉపాధి కల్పన
రంగారెడ్డి	130	5,155	8,857
మేడ్చల్	262	832	6,760
వికారాబాద్	56	58	396

ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలి

» అదనపు కలెక్టర్ సుధీర్

» 16మందికి కారుణ్య నియామక పత్రాలు అందజేత



కారుణ్య నియామక పత్రాలను అందజేసి సన్మానించిన జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్

వికారాబాద్, మార్చి24(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులు ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని అదనపు కలెక్టర్, జడ్పీ సీఈవో సుధీర్ కుమార్ అన్నారు. సోమవారం జిల్లా పరిషత్ ద్వారా 16 మంది అర్హులకు కారుణ్య నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. పంచాయతీ రాజ్ శాఖలో ఖాళీలు లేకపోవడంతో చాలాకాలంగా కారుణ్య నియామకాలు చేపట్టలేదన్నారు. ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కలు ప్రత్యేకంగా చొరవ తీసుకొని అటెండర్ పోస్టులను జూనియర్ అసిస్టెంట్లుగా అప్‌గ్రేడ్ చేసి ఈ నియామకాలను చేపట్టారన్నారు. ఇందులో భాగంగా వికారాబాద్ జిల్లా పరిషత్‌లో మొత్తం 16 మందికి పోస్టింగ్ ఇచ్చామన్నారు. పంచాయతీ రాజ్ మినిస్టీరియల్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందకుమార్ మాట్లాడుతూ గత ప్రభుత్వం కారుణ్య నియామకాలు చేపట్టక పోవడంతో కుటుంబ పెద్దను కోల్పోయిన కుటుంబాలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చిందన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు రాజేందర్, జిల్లా పరిషత్ సిబ్బంది చంద్రశేఖర్, వినయ్ కుమార్, బెన్నీ, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మల్లన్న కల్యాణోత్సవం



బోనాలతో మల్లన్న కల్యాణోత్సవంలో పాల్గొన్న మహిళలు

మేడ్చల్ టౌన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) మేడ్చల్ మున్సిపాలిటీ పూడూరు మల్లన్న కల్యాణోత్సవం సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ప్రతీ సంవత్సరం గ్రామంలో జరుపుకునే ఈ వేడుకల్లో స్థానిక ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు. మహిళలు బోనాలతో ఆలయానికి పెద్దసంఖ్యలో విచ్చేశారు. స్థానిక ఎమ్మెల్యే మల్లారెడ్డి ఆలయానికి విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కల్యాణోత్సవంలో పాల్గొనడానికి వచ్చేసిన భక్తులకు ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ నాయకులు పాల్గొని పూజలు చేశారు.

కుల సంఘాలు సమాజ సేవ చేయాలి

మేడ్చల్ టౌన్: కులసంఘాలు తమ కులానికి పరిమితం కాకుండా సమాజ సేవకోసం పాటు పడాలని మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి అన్నారు. మేడ్చల్ మున్సిపల్ పూడూరులో సోమవారం రూ.16లక్షలతో నిర్మించిన యదవ సంఘం భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు జగన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ బాబు యాదవ్ పాల్గొన్నారు.



గాలి ద్వారా టీబీ వ్యాప్తి

» డీఎంహెచ్‌వో వెంకటరవణ

వికారాబాద్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): టీబీ ఒకరి నుంచి మరొకరికి గాలి ద్వారా వ్యాపిస్తుందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి వెంకటరవణ తెలిపారు. సోమవారం ప్రపంచ టీబీ దినోత్సవాన్ని పురస్కరించుకుని వికారాబాద్ పట్టణంలోని రామయ్యగూడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, పాఠశాల విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ జ్వరం, తెమడతో కూడిన దగ్గు, దగ్గినప్పుడు రక్తం పడడం, ఆకలి తగ్గిపోవడం, బరువు తగ్గడం వంటి లక్షణాలు కన్పిస్తే వెంటనే డాక్టర్‌ను సంప్రదించి వైద్యుల సూచనల మేరకు మందుల వాడాలని తెలిపారు. టీబీ రోగి దగ్గినప్పుడు తుమ్మినప్పుడు తుంపర్ల ద్వారా వ్యాధి ఇతరులకు సోకే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. ఆరోగ్య వంతులకు టీబీ వ్యాధి సోకే అవకాశం చాలా తక్కువగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో టీబీ నియంత్రణ అధికారి డాక్టర్ రవీంద్ర యాదవ్ డాక్టర్ బుచ్చిబాబు, డాక్టర్ నిఖిల్, డాక్టర్ సృజన్, డాక్టర్ సౌమ్య, వైద్య సిబ్బంది పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఓవర్సీస్ స్కాలర్ షిప్‌నకు దరఖాస్తుల ఆహ్వానం

వికారాబాద్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ విద్యార్థులకు అంబేడ్కర్ ఓవర్సీస్ స్కాలర్ షిప్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ అధికారి మల్లేశం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు మే 19 వరకు హెచ్‌టీటీపీఎస్://తెలంగాణ ఈ పాస్.సీజీజీ.ఐఎన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. అమెరికా, కెనడా, జర్మనీ, యూకే, సింగపూర్, జపాన్, దక్షిణ కొరియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ వంటి దేశాల్లో ఉన్నత విద్య కోసం ఈ పథకం ద్వారా రూ.20లక్షల స్కాలర్ షిప్ మంజూరు చేయబడుతుందన్నారు. అభ్యర్థులు డిగ్రీ(సాంకేతిక, వృత్తి కోర్సులు) పూర్తి చేసి ఉత్తీర్ణులై ఉండాలన్నారు. కుటుంబ ఆదాయం రూ.5లక్షలలోపు ఉండాలని, ఒక్క కుటుంబం నుంచి ఒక్కరే దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంపికైన వారికి వన్ వే ఎకనామి విమాన టికెట్, వీసా చార్జీలు కల్పించబడతాయన్నారు. వివరాలకు షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

ఫటా ఫట్

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



● మర్పల్లి ఎస్ఐ సురేశ్

మర్పల్లి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఇటీవల పెరుగుతున్న నేరాల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మర్పల్లి ఎస్ఐ సురేశ్ ప్రజలకు సూచించారు. ఆయన సోమవారం ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో దొంగతనాలు, సైబర్ నేరాల కట్టడి తదితర అంశాలపై వివరించారు.

ఆంధ్రజ్యోతి: చోరీలను అరికట్టేందుకు తీసుకుంటున్న చర్యలు?

ఎస్ఐ: రాత్రి వేళల్లో పోలీసు సిబ్బందితో పెట్రోలింగ్ నిర్వహిస్తున్నాం. గ్రామాల్లో అనుమానిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: సైబర్ నేరాల కట్టడి ఎలా?

ఎస్ఐ: మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో ప్రజలకు సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాల గురించి ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తున్నాం. ఫోన్‌లకు వచ్చే మోసపూరిత లింక్‌లను క్లిక్ చేయొద్దని సూచిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: సెల్‌ఫోన్ పోగొట్టుకున్న వారు ఏం చేయాలి?

ఎస్ఐ: సెల్‌ఫోన్ పోగొట్టుకున్న బాధితులు కంగారు పడకుండా ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేస్తే సీఈఐఆర్ యాప్ ద్వారా రికవరీ చేసి బాధితులకు అప్పగిస్తాం.

ఆంధ్రజ్యోతి: ఆత్మహత్యల నివారణకు తీసుకుంటున్న చర్యలు?

ఎస్ఐ: గ్రామాల్లో కళాబృందాలతో ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు క్షణికావేశంలో ఆత్మహత్యలు శరణ్యం కాదని అవగాహన కల్పిస్తున్నాం.

యథేచ్ఛగా ఇసుక దందా

● అనుమతులకు మించి తవ్వకాలు

● మామూళ్ల మత్తులో అధికారులు

దోమ, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలో అక్రమ ఇసుక దందా మూడు పువ్వులు, ఆరు కాయలుగా యథేచ్ఛగా కొనసాగుతోంది. అనుమతులు గోరంత అయితే వ్యాపారం కొండంత అనే చందంగా దందా కొనసాగిస్తున్నారు. మండలంలోని దిర్సంపల్లి, దాదాపూర్, బాసుపల్లి, డోర్నాల్‌పల్లి, ఉదన్‌రావుపల్లి గ్రామాల సమీపంలో ఉన్న వాగుల నుంచి అక్రమంగా ఇసుకను తరలించి విచ్చలవిడిగా వ్యాపారంతో సొమ్ము చేసుకుంటున్నారు.



దిర్సంపల్లి గ్రామ సమీపంలో అక్రమంగా డంపు చేసిన ఇసుక

పది ట్రిప్పులకు అనుమతులు

దోమ మండలంలోని దిర్సంపల్లి పాఠశాల మరమ్మతుల కోసం 10 ట్రాక్టర్ల ఇసుక అవసరం ఉండగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటయ్య తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి తహసీల్దార్ పురుషోత్తం దగ్గర రెండు ట్రాక్టర్లతో ఇసుకను తీసుకెళ్లేందుకు అనుమతులు పొందారు. అధికారుల అనుమతులతో గ్రామ సమీపంలోని వాగు దగ్గర ట్రాక్టర్ల యజమానులు ఇసుకను తరలించి పాఠశాలలో నాలుగు నుంచి ఐదు ట్రాక్టర్లు వేశారు. మరో పది ట్రాక్టర్ల ఇసుకను గ్రామంలోని ఇతర వ్యక్తులకు అక్రమంగా విక్రయించారు. అనుమతులు పాఠశాలకు తీసుకున్నప్పటికీ మరో ప్రాంతంలో ఇసుక నిల్వలతో సొమ్ము చేసుకునేందుకు ప్రయత్నించారు. విషయం తహసీల్దార్ దగ్గరికి చేరడంతో రెవెన్యూ సిబ్బందిని పంపించి విచారణ చేయించారు. అక్రమంగా ఇసుక తరలించిన రెండు ట్రాక్టర్‌లపై దోమ ఎస్ఐ ఆనంద్ కుమార్ కేసు నమోదు చేసినా అక్రమ ఇసుక దందా అంతటితో ఆగలేదు.

టాస్క్‌ఫోర్స్ అధికారుల దాడులు

అక్రమ ఇసుక దందా కొనసాగుతున్నట్లు ఫిర్యాదులు వచ్చినా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో టాస్క్‌ఫోర్స్ అధికారులు రంగంలోకి దిగి ఓ ట్రాక్టర్‌ను సీజ్ చేశారు. మామూళ్లకు అలవాటుపడిన అధికారులు అక్రమ ఇసుక, కలప రవాణా పై కన్నెత్తి చూడటం లేదనే ఆరోపణలు ఉన్నాయి. గుండాల్, దాదాపూర్ గ్రామాల్లో కలప, ఇసుక అక్రమ రవాణాలో పోలీసులకు చేతులు తడపడంతో వదిలేస్తున్నారని ఆయాగ్రామాల ప్రజలు చర్చించుకుంటున్నారు.

అధికారుల కనుసైగల్లో

ఇసుకను అక్రమంగా నిల్వ చేసుకునేందుకు వ్యాపారులు ముందే అధికారులతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు సమాచారం. పాఠశాలకు పది ట్రాక్టర్లు అవసరమైతే కొంత మేర తరలించి మిగతా ప్రాంతాల్లో డంపు చేసుకొని అధికారుల కనుసైగల్లో సొమ్ము చేసుకునేందుకు ప్రణాళికలు వేశారు. కానీ స్థానికులు, అటుగా వెళ్లే ప్రయాణికులు విషయం అధికారులకు తెలపడంతో వ్యాపారుల్లో గుబులు మొదలైంది.

చర్యలు తీసుకుంటున్నాం

ఇసుక తరలింపుకు గతంలో అనుమతులు ఓ ప్రాంతంలో పొంది మరో ప్రాంతానికి తరలించిన ఇసుక వ్యాపారులపై చర్యలు తీసుకున్నాం. ఇంకా ఎక్కడైనా అక్రమ ఇసుక రవాణా జరుగుతున్నట్లు మా దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటాం.

- పురుషోత్తం, తహసీల్దార్, దోమ మండలం

క్రైం కార్నర్

బైక్‌ను ఢీకొన్న ప్రైవేటు బస్సు.. వ్యక్తి మృతి



మృతుడు షాదుల్లా

మూడుచింతలపల్లి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఓ ప్రైవేట్ ట్రావెల్ బస్సు బైక్‌ను ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన తుర్కపల్లిలోని జీనోమ్ వ్యాలీ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. తుర్కపల్లికి చెందిన షాదుల్లా(27) ర్యాపిడోలో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. తన యాక్టీవా స్కూటీపై కొల్తూర్ గ్రామం నుంచి తుర్కపల్లికి వస్తుండగా ప్రైవేటు ట్రావెల్స్ బస్సు అతివేగంగా వస్తూ భారత్ బయోటెక్ సమీపంలో ఎదురుగా వస్తున్న షాదుల్లా బైక్‌ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో షాదుల్లా తలకు బలమైన రక్త గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ..



సునీత(ఫైల్)

ఘట్‌కేసర్ రూరల్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): రోడ్డు దాటుతుండగా బైక్ ఢీకొట్టిన ప్రమాదంలో చికిత్స పొందుతూ మహిళ మృతిచెందింది. ఈ ఘటన పోచారం ఐటీ కారిడార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రాజువర్మ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఏపీలోని నెల్లూరు జిల్లా కావలి మండలం అన్నగారి పాలెంకు చెందిన శ్రీనివాస్, భార్య సునీత ఇద్దరు పిల్లలతో కలిసి పీర్జాదిగూడ, గణేష్‌నగర్‌లో ఉంటూ మేస్త్రీ పనులు చేసుకుంటున్నారు. కాగా ఈనెల 20వ తేదీన సునీత పని నిమిత్తం పోచారం మున్సిపాలిటీ, అన్నోజిగూడలోని ఎన్టీపీసీ చౌరస్తా వద్ద బస్సుదిగి రోడ్డు దాటుతుండగా బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సునీతకు తీవ్రగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం నగరంలోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆమె ఆదివారం అర్ధరాత్రి దాటాక మృతిచెందింది. ప్రమాదానికి కారణమైన సంతోష్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సునీత మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

ఘట్‌కేసర్ రూరల్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో ఓ వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ పరశురాం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రాజస్థాన్‌కు చెందిన భూపాల్ సింగ్(30) ఆరేళ్ల కిందట ఘట్‌కేసర్ మున్సిపాలిటీ, అవుషాపూర్‌లో అద్దెకు ఉంటూ బీబీనగర్ పరిసర ప్రాంతాల్లో కూరగాయాలు విక్రయిస్తుంటాడు. ఇటీవల అప్పులు ఎక్కువ కావడంతో సోమవారం భార్య బీబీనగర్‌కు వెళ్లగా, ఇంట్లో ఎవరూలేని సమయంలో స్టోర్ రూంలోకి వెళ్లి చున్నీతో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య ఇంటికి వచ్చి చూడగా ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. దీంతో స్థానికుల సాయంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, కూతురు ఉన్నట్లు తెలిపారు. అప్పులబాధతో తన భూపాల్ సింగ్ ఆత్మహత్యకు పాల్పడ్డాడని కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని ఇద్దరికి గాయాలు

కోట్‌పల్లి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు ఢీకొని భార్యాభర్తలకు గాయాలైన సంఘటన కోట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వికారాబాద్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు కోట్‌పల్లి వస్తుండగా రాంపూర్ గ్రామం నుంచి భార్యాభర్తలు వెంకటేశం శ్రీలతలు బైక్‌పై కోట్‌పల్లి సంతకు వెళ్తున్నారు. గ్రామ సమీపంలో ఉన్న మూలమలుపు వద్ద బస్సు వెనుక భాగంలో బైక్‌కు తగలడంతో దీంతో కిందపడి ఇద్దరికీ స్వల్పగాయాలయ్యాయి. వారిని వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆర్టీసీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గఫార్ తెలిపారు.

వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



బ్రహ్మోత్సవాల ప్రారంభోత్సవంలో ఆలయ ధర్మకర్తలు

కొడంగల్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): పేదల తిరుపతిగా పేరొందిన కొడంగల్ శ్రీ వేంకటేశ్వర స్వామి 45వ వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఏప్రిల్ 3 వరకు 9 ఉత్సవాలను తిరుమల తిరుపతి దేవస్థానానికి అనుసంధానంగా అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్తలు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఆలయంలో శ్రీ వేంకటేశ్వరస్వామికి పురోహితులు కోవిల్ అల్వార్ తిరుమంజనం నిర్వహించారు. మంగళవారం సాయంత్రం 4 గంటలకు శ్రీ విశ్వక్సేన స్వామివారి తిరుచ్చి ఉత్సవంలో భాగంగా ఆలయం నుంచి కొడంగల్ ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఉన్న పారువేట మండపం వరకు స్వామివారి ఊరేగింపు నిర్వహిస్తారు. అనంతరం పారువేట మండపంలో మృత్సంగ్రహణం, అంకురార్పణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్తలు తెలిపారు.

నేడు చెంగోల్‌లో వేంకటేశ్వరస్వామి కల్యాణం

తాండూరురూరల్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెంగోల్‌లో నేడు(మంగళవారం) శ్రీదేవి, భూదేవి సహిత వేంకటేశ్వర స్వామి కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ ప్రెసిడెంట్ వడ్డె కృష్ణయ్య అన్నారు. ఉదయం 5గంటలకు సుప్రభాతం, 6గంటలకు గోపూజ, శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారి మహా అభిషేకం, 9గంటలకు స్వామివారి అలంకరణ, మంగళ హారతి, 11గంటలకు స్వామివారి కల్యాణం ప్రారంభం, 12.5గంటలకు శ్రీవారి కల్యాణం, సాయంత్రం 5గంటలకు స్వామివారి పల్లకిసేవా, 7గంటలకు స్వామివారి తొట్టెల సేవా, మంగళహారతి తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

'అధిక సాంద్రత'తో పత్తి దిగుబడి పెరుగుదల



మాట్లాడుతున్న శాస్త్రవేత్త డాక్టర్ సునీత

ధారూరు, మార్చి24(ఆంధ్రజ్యోతి): అధిక సాంద్రత సాగుతో పత్తి దిగుబడితో రైతుల ఆదాయాన్ని పెంచుకోవచ్చని వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ లక్ష్మణ్ తెలిపారు. ధారూరు రైతు వేదికలో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఏరువాక కేంద్రం తాండూరు వారి ఆధ్వర్యంలో సోమవారం రైతు సదస్సును నిర్వహించారు. ఈ సదస్సులో ఆయన మాట్లాడుతూ అధికసాంద్రత పద్ధతిలో పంట కాలం తగ్గి పత్తి పంట జనవరికల్లా పూర్తయి, రెండోపంట వేసుకోవచ్చని ఆయన చెప్పారు. ఈ సదస్సులో వికారాబాద్ ఏడీఏ వినోద్‌కుమార్, శాస్త్రవేత్త డాక్టర్ సునీత, ఏవో సూర్యప్రకాష్, శాస్త్రవేత్త యమున, పీఏసీఎస్ చైర్మన్ వైసత్యనారాయణ రెడ్డి, ఏఈవోలు సంజూరాథోడ్, శిరీష పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యం వల్లే బాలుడి మృతి

పరిగి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): విద్యా సంస్థల్లో అధికారుల నిర్లక్ష్యం వల్లే కులకచర్ల మండలం అల్లాపూర్‌తండాలోని అంగన్‌వాడి కేంద్రం భవనంలో శిలాఫలకం దిమ్మె కూలి నాలుగేళ్ల బాలుడు సాయి మృతిచెందాడని పరిగి మాజీ ఎమ్మెల్యే కె.మహేశ్‌రెడ్డి అన్నారు. బాలుడి మృతదేహాన్ని సోమవారం పరిగి ఆస్పత్రికి చేర్చగా అక్కడికి మాజీ ఎమ్మెల్యే చేరుకుని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. వారి కుటుంబసభ్యులను ఓదార్చి సానుభూతిని వ్యక్తం చేశారు. రూ.5వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో విద్యార్థులకు రక్షణ లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తంచేశారు. పరామర్శించిన వారిలో నాయకులు ఆర్.అంజనేయులు, ప్రవీణ్‌రెడ్డిలు ఉన్నారు.

గ్రామాల అభివృద్ధే కాంగ్రెస్ ధ్యేయం

దౌల్తాబాద్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంకట్రావ్, జిల్లా ఉపాధ్యక్షుడు వెంకట్‌రెడ్డి అన్నారు. మండలంలోని దేవరఫస్లాబాద్ నుంచి పల్లెర్ల వరకు సోమవారం బీటీ రోడ్డు (డబుల్) నిర్మాణ పనులను వారు ప్రారంభించారు. అదే విధంగా సురయిపల్లి నుంచి కొత్తపల్లి వరకు బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కోట్ల హనుమంతు, ప్రమోద్‌రావు, రాములు, వెంకట్, వీరన్న పాల్గొన్నారు.

పూజా కార్యక్రమాలకు ఆహ్వానం

కొడంగల్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): కొడంగల్ పట్టణ శివారులోని సిద్దనొంపు ఆంజనేయస్వామి ఆలయంలో ఏప్రిల్ 12న పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. హనుమాన్ విజయోత్సవం సందర్భంగా నిర్వహించే పూజలకు సోమవారం మున్సిపల్ మాజీ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి హిందూ వాహిని సభ్యులు, యువకులు కలిసి కరపత్రం అందించి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో హిందూ వాహిని సభ్యులు, యువకులు పాల్గొన్నారు.

తాండూరులో అరుదైన చికిత్స

తాండూరు, మార్చి 24(ఆంధ్రజ్యోతి): తాండూరులోని శ్రీ బాలాజీ ఆస్పత్రి వైద్యులు అరుదైన శస్త్ర చికిత్స చేశారు. వివరాల్లోకి వెళ్తే.. యాలాల మండలం దుబ్బతాండాకు చెందిన బాబ్యా నాయక్ భార్య పుత్లీబాయి తొమ్మిదేళ్లుగా కిడ్నీ సంబంధిత సమస్యతో బాధపడుతోంది. పలుమార్లు హైదరాబాద్‌లో పలు ప్రైవేటు ఆస్పత్రులు, ప్రభుత్వ ఆస్పత్రుల్లో చూపించినా ఫలితం లేకుండా పోయింది. ఇటీవల పుత్లీబాయి ఆరోగ్యం మరింత క్షీణించడంతో కుటుంబ సభ్యులు తాండూరులోని శ్రీ బాలాజీ నర్సింగ్ హోంకు తీసుకొచ్చారు. ఆస్పత్రి అధినేత డా.సంపత్ కుమార్ ఆధ్వర్యంలో పుత్లీబాయికి డాక్టర్లు రణదీర్, అనిస్, ఆగధ, నాగదివ్య, మహబూబ్‌ల బృందం 3గంటల పాటు శ్రమించి ఈ అరుదైన చికిత్స చేశారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగా ఉందని ఆస్పత్రి అధినేత డాక్టర్ సంపత్ కుమార్ తెలిపారు.

వ్యవసాయ పరికరాలకు దరఖాస్తు చేసుకోవాలి

కోట్‌పల్లి, మార్చి24 (ఆంధ్రజ్యోతి): అర్హులైన లబ్ధిదారులు వ్యవసాయ పరికరాల కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి కరుణాకర్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన సోమవారం మాట్లాడుతూ మండలానికి సబ్సిడీలో మంజూరైన పరికరాలు వివరాలు 4 బ్యాటరీ స్ప్రేయర్ 1,000 రూపాయిలు సబ్సిడీ ప్రభుత్వం కల్పిస్తుంది. 4 తైవాన్ స్ప్రేయర్ 9,000 రూపాయల సబ్సిడీ, 2 రోటవేటర్స్ పరికరాలు 45,000 సబ్సిడీ, 2 కల్టివేటర్ పరికరాలు 18,000 సబ్సిడీని ప్రభుత్వం కల్పిస్తుందని, ఆసక్తి గల మహిళా రైతులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

మర్పల్లి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మహిళలు స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలని మర్పల్లి ఎంపీడీవో రాజమల్లయ్య, ఎస్ఐ సురేశ్ అన్నారు. మండల కేంద్రంలోని స్త్రీ శక్తి భవనంలో సోమవారం మహిళా స్వయం ఉపాధి కోసం అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రభుత్వాలు మహిళా సంఘాలకు అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

పంట పొలాల్లో 'హైటెన్షన్'

(ఐదో పేజీ తరువాయి)

మోమిన్‌పేట్, నవాబుపేట, వికారాబాద్ మండలాల పరిధిలో నుంచి ఈ విద్యుత్ లైన్ వెళ్లనుంది. ఇప్పటికే పూర్తి సర్వే పూర్తి అయిందని, రైతులకు నష్ట పరిహారం అందించేందుకు కూడా అధికారులు నిర్ణీత ధర నిర్ణయించినట్లుగా తెలుస్తోంది. కానీ కొందరూ అధికారులు, ప్రైవేట్ వ్యక్తులు కుమ్మక్కై రైతులకు ఎంత వస్తుందని స్పష్టమైన వివరాలు తెలుపకుండా బేరాలు మాట్లాడుతున్నట్లుగా రైతులు పేర్కొంటున్నారు.

టవర్‌కు 8 గుంటల భూమి

ఒక విద్యుత్ టవర్ ఏర్పాటుకు కనీసం 8 గుంటల భూమి తీసుకుంటున్నట్లుగా తెలుస్తోంది. అదే క్రమంలో పొలం పై నుంచి విద్యుత్ వైర్లు వెళ్తుండడంతో టవర్ ఏర్పాటుకు ఒక లెక్క, విద్యుత్ వైర్లకు ఒక లెక్కగా అధికారులు ధరను నిర్ణయించారు. పొలాలపై నుంచి విద్యుత్ వైర్లు, టవర్లు పోతే వారికి ఇంత నష్టపరిహారం ఇవ్వాలని ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసిన విషయం తెలిసిందే.

మార్కెట్ విలువకు 200శాతం అదనంగా

పంట పొలాల్లో విద్యుత్ టవర్ల ఏర్పాటు విషయంలో నిబంధనలు తప్పని సరిగా పాటించాలని ఈఆర్సీ ఆదేశించింది. పొలాల్లో టవర్ ఏర్పాటు చేస్తే ఆ స్థలం మార్కెట్ విలువతో పోల్చితే 200 శాతాన్ని, లైన్లు వేస్తే 30 శాతాన్ని పరిహారంగా ఇవ్వాలని జీవో సైతం ఉందని ట్రాన్స్‌కో జేఎండీ శ్రీనివాస్‌రావు ఇటీవల పేర్కొన్నారు. కానీ రైతుకు ఇంత పరిహారం అందుతుందని అధికారులు ఎక్కడా ప్రకటించలేదు. సోమవారం వికారాబాద్ ఆర్డీవోను మోమిన్‌పేట మండల పలువురు రైతులు కలిశారు. తమ పొలంలో టవర్ ఏర్పాటుకు గుంత కొట్టారని, ముందుగా రూ.3 లక్షలు మొదలు కొని రూ.15 లక్షల వరకు ఇస్తామని మాట్లాడారని మండిపడ్డారు. తీరా ఓ పత్రికలో వచ్చిన కథనంతో తన పొలంలో గుంతలు తీయొద్దని సరైన పరిహారం అందించాలని కోరితే రూ.17 లక్షలు ఇస్తామని చెప్పినట్లుగా ఆర్డీవోకు వివరించారు. దీంతో ఆర్డీవో ట్రాన్స్‌కో ఇంజనీర్‌తో మాట్లాడి రైతులకు వివరాలు తెలియజేయాలని ఇప్పటికే కలెక్టర్ అందుకు సంబంధించిన జీవో ఇవ్వడం జరిగిందని సంబంధిత అధికారికి సూచించారు.

న్యాయం చేయాలి



ఎన్కతల గ్రామంలో సర్వే నెంబర్ 387లో నాకు 1.24 ఎకరాల భూమి ఉంది. అందులో నుంచి హై టెన్షన్ విద్యుత్ లైన్ వెళ్తున్నట్లు అధికారులు తెలిపారు. మాకు పరిహారం విషయంలో అధికారులు స్పష్టమైన లెక్కలు చెప్పాలి. మధ్యవర్తులు, కింది స్థాయి అధికారులపై మాకు నమ్మకం లేదు. ట్రాన్స్‌కో, రెవెన్యూ అధికారులు గ్రామ సభలు పెట్టి పరిహారం వివరాలు స్పష్టంగా తెలిపి న్యాయం చేయాలి.

- రైతు నారాయణరెడ్డి, ఎన్కతల, మోమిన్‌పేట

బేరాలు మాట్లాడుతున్నారు



కాస్లాబాద్ గ్రామంలో సర్వేనంబర్ 141లో మా కుటుంబానికి సంబంధించి ముగ్గురి పొలాలు ఉన్నాయి. ఇందులో నుంచి హై టెన్షన్ విద్యుత్ టవర్లు వెళ్తున్నాయని అధికారులు తెలిపారు. ముందుగా పరిహారం ఇస్తామని చెప్పి రూ.3 లక్షలు మాట్లాడి కొద్ది కొద్దిగా రూ.15 లక్షల వరకు ఇస్తామని తెలిపారు. ప్రభుత్వం చెప్పిన విధంగా ఇవ్వాలని డిమాండ్ చేయడంతో రూ.17 లక్షలు ఇస్తామన్నారు. ఇందులో ఏదో తికమక ఉందని గ్రహించి ఆర్డీవోకు వివరించాం.

- చింతకుంట రామగౌడ్, కాస్లాబాద్ మండలం

నాపరాతి అక్రమ తవ్వకాలపై ఫిర్యాదు



ఫిర్యాదు కాపీని చూపిస్తున్న మల్కాపూర్ గ్రామస్తులు

తాండూరురూరల్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్కాపూర్ గ్రామ శివారులోని అసైన్డ్ సీలింగ్ భూమి సర్వే నెంబర్-72లో కొందరు అక్రమ తవ్వకాలకు పాల్పడుతున్నారని సోమవారం వికారాబాద్ జిల్లాలో నిర్వహించిన ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. 72 సర్వేనెంబర్‌లో 18 ఎకరాల 20 గుంటల భూమిని కొందరు మైనింగ్ లీజుల పేరిట అక్రమ తవ్వకాలకు పాల్పడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇట్టి భూముల్లో తవ్వకాలపై గతనెలలో ఫిర్యాదు చేయగా, తాండూరు మైన్స్ ఏడీ సత్యనారాయణ, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గోపి, సర్వేయర్ ప్రసాద్‌లు వచ్చి సర్వేచేసి అక్రమ తవ్వకాలపై విచారణ జరుపుతామని సమాచారం ఇచ్చారు. అయినా వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత జిల్లా, రెవెన్యూ, మైన్స్, విజిలెన్స్ అధికారులు స్పందించి క్షేత్రస్థాయిలో పర్యటించి అక్రమ తవ్వకాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిర్యాదు ఇచ్చిన వారిలో తుకారాం, అరవింద్‌రావు, మహేందర్ రెడ్డి తదితరులున్నారు.

సజావుగా 'పది' పరీక్షలు



మంబాపూర్ పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న తాండూరు సబ్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్

పెద్దేముల్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి వార్షిక పరీక్షలు సజావుగా సాగుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ సోమవారం పెద్దేముల్ మండలం మంబాపూర్‌లోని 10వ తరగతి పరీక్ష కేంద్రాన్ని పరిశీలించారు. పరీక్ష కేంద్రంలో విద్యార్థులకు సరియైన వసతులు ఉన్నాయా అని అక్కడ నియమించిన అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఆర్ఐ సైమన్ ఉన్నారు.

కొడంగల్: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర, బాలికల పాఠశాలలు, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను కొడంగల్ తహసీల్దార్ విజయ్‌కుమార్ పరిశీలించారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా చూడాలని సూచించారు.

చలివేంద్రం ప్రారంభం

పూడూరు, మార్చి 24, (ఆంధ్రజ్యోతి): గ్రామానికి చెందిన ఎన్కెపల్లి ఎల్లయ్య జ్ఞాపకార్థం మండలంలోని చెన్‌గోముల్ గ్రామంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సోమవారం బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు కన్నయ్యల రాజు, ఎస్‌బీఐ బ్యాంకు మేనేజర్ నరేష్ కుమార్ చలివేంద్రాన్ని ప్రారంభించారు.

లబ్ధిదారులకు బియ్యం పంపిణీ

బషీరాబాద్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొట్టిగకలాన్‌లో నూతన రేషన్‌కార్డుదారులకు ఉచిత బియ్యాన్ని కాంగ్రెస్ మండల యువనాయకులు మాణిక్‌రావు సోమవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కిష్టయ్యగౌడ్, స్థానిక నాయకులు, ప్రజలు పలువురు పాల్గొన్నారు.

ఇస్రోను సందర్శించిన విద్యార్థులు



ఇస్రో సందర్శనలో విద్యార్థులు

చౌడాపూర్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మరికల్ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు సోమవారం శ్రీహరికోటలోని ఇస్రోను సందర్శించారు. జీవశాస్త్ర ఉపాధ్యాయులు విద్యార్థులను శ్రీహరికోటకు తీసుకెళ్లి అక్కడ ఇస్రోలో రాకెట్స్ ప్రయోగించే విధానం గురించి వివరించారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

నవాబుపేట, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పలువురు లబ్ధిదారులకు చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం తహసీల్దార్ జయరాంతో కలిసి తొమ్మిది మంది లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ నర్సింహారెడ్డి, కాంగ్రెస్ నాయకులు తలారి ప్రభాకర్ పాల్గొన్నారు.

నేడు 'చలో హైదరాబాద్'

తాండూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల్లో మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ ఈ నెల 25న (నేడు) సీఐటీయూ ఆధ్వర్యంలో 'చలో హైదరాబాద్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిా స్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటీయు) వికారాబాద్ జిల్లా ఉపాధ్యక్షులు కె. శ్రీనివాస్ తెలిపారు.

టెక్స్‌టైల్స్ కంపెనీపై కలెక్టర్‌కు ఫిర్యాదు

ధారూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధారూరు స్టేషన్ పరిధిలో చార్లీ టెక్స్‌టైల్స్ ప్రింటింగ్ కంపెనీ అనుమతులు లేకుండా నడుస్తోందని, విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని మాజీ సర్పంచ్ యాదయ్య సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ కంపెనీ 2010 నుంచి పంచాయతీ అనుమతి లేకుండా నడిపిస్తున్నారని, పంచాయతీకి పన్నులు చెల్లించడంలేదని తెలిపారు. అదేవిధంగా అక్రమ కట్టడాలు కొనసాగుతున్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు.

జిల్లా స్థాయి క్విజ్ పోటీలకు ఎంపిక

మోమిన్‌పేట్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి క్విజ్ పోటీలకు మోమిన్‌పేట్ మండల విద్యార్థులు ఎంపికైనట్లు ఎంఈవో మల్లేశం తెలిపారు. మండలంలోని వెల్చాల్ పాఠశాల కాంప్లెక్స్ ఆవరణలో సోమవారం బురుగుపల్లి, టేకులపల్లి, మక్తతండా, నవాబుపేట మండలంలోని ఆర్కతల పాఠశాలల విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక కావడంతో అభినందించారు. వారం రోజులుగా విద్యార్థులకు శిక్షణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. మండలంలోని బురుగుపల్లి పాఠశాల మొదటి బహుమతిని గెలుపొంది జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. అదే విధంగా నవాబుపేట మండలంలోని ఆర్కతల పాఠశాల ద్వితీయ బహుమతిని, మోమిన్‌పేట్ మండలంలోని టేకులపల్లి తండా పాఠశాల తృతీయ బహుమతిని సాధించారు. ఎంఈవో ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వీరేశం, సుధాకర్, శిక్షణ ఫౌండేషన్ జిల్లా ప్రతినిధులు రాజు, సత్యానందం, రమేశ్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

గ్రామాల రోడ్లకు మహర్దశ

మోమిన్‌పేట్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ పాలనలో మారుమూల గ్రామాల రోడ్లకు మహర్దశ పట్టిందని బీజేపీ దిశా కమిటీ సభ్యుడు వడ్ల నందు అన్నారు. మండలంలోని వెల్చాల్ గ్రామంలో సోమవారం చేవెళ్ల ఎంపీ కొండ విశ్వేశ్వర్‌రెడ్డి రూ.10లక్షల నిధులతో సీసీరోడ్డు పనులకు చేవెళ్ల పార్లమెంట్ లీగల్ సెల్ కన్వీనర్ రమేశ్ ముదిరాజ్‌తో కలిసి ప్రారంభించారు. అన్నారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ లీగల్‌సెల్ రమేశ్ ముదిరాజ్, బీజేపీ మండల అధ్యక్షుడు ఆశిరెడ్డి, భుజంగ్‌రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, విఠల్, మహేశ్, బాల్‌రాజ్, దామోదర్ పాల్గొన్నారు.

బీరప్ప జాతరలో మాజీ ఎమ్మెల్యే



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఆనంద్

ధారూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎబ్బనూర్‌లో కొనసాగుతున్న బీరప్ప జాతరలో సోమవారం మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎం.ఆనంద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మల్లన్నస్వామి పూజలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి, నాయకులు వేణుగోపాల్ రెడ్డి, అనంత్‌రెడ్డి పాల్గొన్నారు.